నారాయణపురం వంతెన పరిశీలన

పాత స్లాబ్‌పైనే కొత్తగా స్లాబు వేసేందుకు నిర్ణయం

ఉంగుటూరు : నారాయణపురం వద్ద వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఆర్‌అండ్‌బి శాఖకు చెందిన డిజైనర్, సాంకేతిక నిపుణుడు సత్యవిజయ్ మంగళవారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బి డిఇ గోవిందమోహన్, ఎఇ పి.భాస్కరరావులతో కలసి వంతెనకు చేయనున్న మరమ్మతులు, స్లాబు వేయాల్సిన విధానంపై పలు అంశాలపై సలహాలు, సూచనలిచ్చారు. ప్రస్తుతమున్న వంతెన కింద రెండు ఖానాల్లో ఊచలు బయటకు కనిపిస్తూ స్లాబు అడుగు పెచ్చులు ఊడాయి. కుంగిన ఖానాపై స్లాబును పూర్తిగా తొలగించి కొత్తగా సిమెంటు స్లాబు వేయాల్సి ఉంది. కేవలం కారులు, స్కూలు బస్సులు, ఆర్‌టిసి బస్సులు ఆటోలు, ఖాళీ లారీలు లాంటి తేలికపాటి వాహనాలు మాత్రమే వెళ్లేందుకు వీలుగా ఇనుప ఊచలతో మెస్ కట్టి దానిపై సిమెంటు కాంక్రీటు స్లాబ్ వేసేందుకు అంతిమ నిర్ణయం తీసుకున్నారు. ఎంఎల్‌ఎ ధర్మరాజు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలిచ్చారు.

'బెల్టు' జోరు.. 'పర్మిట్ల'తో ఫుల్..!

రెండు జిల్లాల్లో ఏరులై పారుతున్న మద్యం

అన్ని మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్‌లు అందుబాటులోకి

మరోపక్క బెల్టు షాపులతో వీధివీధికి మద్యం అమ్మకాలు

ఏలూరు, పశ్చిమలో నెలకు రూ.200 కోట్లకుపైగా మద్యం విక్రయాలు

మద్యం పేరుతో సామాన్యులను గుల్ల చేస్తున్న సర్కార్

ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం అమ్మకాల పెంపునకు ప్రభుత్వం అన్ని మార్గాల్లో.. అన్ని విధాలుగా ముందుకు సాగుతోంది. లైసెన్స్ దుకాణాలకు అనుబంధంగా ఇప్పటికే వందల సంఖ్యలో బెల్టు షాపులు కొనసాగుతుండగా, ఇప్పుడు మద్యం దుకాణాలకు పర్మిట్ రూములను మంజూరు చేసి మద్యం అమ్మకాల జోరు విపరీతంగా పెంచుతోంది. మద్యం అమ్మకాలు పెంచుతూ సామాన్యుల ఇల్లు, ఒళ్లును గుల్ల చేస్తున్న పరిస్థితి ఉంది. తాజాగా బార్లకు లైసెన్సులు మంజూరు చేస్తుండటంతో రానున్న రోజుల్లో రెండు జిల్లాల్లోనూ మద్యం ఏరులై పారుతుందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం షాపులను లాటరీ ప్రక్రియలో కేటాయించింది. ఏలూరు జిల్లాలో 144, పశ్చిమగోదావరిలో 175 మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ నిర్వహించి 2024 అక్టోబర్ 12 నుంచి మద్యం దుకాణాల్లో అమ్మకాలను ప్రారంభించింది. టెండర్ల ద్వారా దుకాణాలు పొందినవారంతా అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో వాటిని నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్యపోక తప్పదు. దీంతో భారీగా మద్యం అమ్మకాలు సాగించేందుకు లైసెన్స్ దుకాణాలకు అనుబంధంగా పెద్దసంఖ్యలో బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి గ్రామంలో ప్రాంతాలవారీగా విభజించి బెల్టు షాపుల కేటాయింపు సైతం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు కొనసాగిస్తున్నా ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. బెల్టు షాపులకు ప్రతిరోజూ 50 బాటిళ్ల నుంచి వంద బాటిళ్లకుపైగా సరఫరా చేస్తుంటారు. బెల్టు షాపుల్లో ఎంఆర్‌పి కంటే బాటిల్‌కు రూ.20 అంతకు మించి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారు. బెల్టు షాపులతో మద్యం ఎక్కడిపడితే అక్కడే దొరుకుతున్న పరిస్థితి ఉంది. ఇది చాలనట్టుట్లు ఇప్పుడు మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

పర్మిట్ రూములతో మరింతగా మద్యం అమ్మకాలు

గతంలో లైసెన్స్ బార్లలో మాత్రమే సిట్టింగ్ విధానం ఉండేది. మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలు మాత్రమే సాగేవి. కూటమి ప్రభుత్వం మాత్రం లాటరీ ద్వారా పొందిన అన్ని మద్యం దుకాణాల్లోనూ పర్మిట్ రూములకు అనుమతిచ్చింది. దీంతో ప్రతి మద్యం దుకాణం వద్దా పర్మిట్ రూములు వచ్చాయి. దీంతో గతంలో క్వార్టర్ తాగే మందుబాబులు అక్కడే కూర్చోని అదనంగా మద్యం తాగే పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా ప్రభుత్వం మద్యం అమ్మకాలను మరింత పెంచుతోంది. ఇప్పుడు బార్లకు లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ చేపట్టింది. ఏలూరు జిల్లాలో 20 బార్లు ఉండగా ఇప్పటి వరకూ పది బార్లకు లైసెన్స్‌లు మంజూరు చేసింది. మిగిలిన వాటికి త్వరలో లైసెన్స్‌లు ఇవ్వనుంది. మద్యం అమ్మకాల పెంపునకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. సామాన్య ప్రజానీకం కష్టపడిన సంపాదనంతా మద్యం రూపంలో ప్రభుత్వం గుంజుకుంటున్న పరిస్థితి ఉంది. అదే క్రమంలో మద్యం తాగి అంతా ఒల్లు గుల్ల చేసుకుని అనారోగ్యం పాలవుతున్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఇస్తున్న సొమ్మును మద్యం రూపంలో ప్రభుత్వం లాగేస్తున్న పరిస్థితి ఉంది.

రెండు జిల్లాల్లో ప్రతినెలా రూ. 200 కోట్లకుపైగా మద్యం అమ్మకాలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రతినెలా రూ.200 కోట్లకుపైగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటే ఆశ్చర్యపోక తప్పదు. పర్మిట్ రూములతో అమ్మకాలు మరింత పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో నెలకు రూ.లక్ష నుంచి రూ.లక్షా 30 వేల వరకూ మద్యం కేసుల విక్రయాలు సాగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో కేసులో 48 క్వార్టర్ బాటిళ్లు ఉంటాయి. 70 వేల వరకూ బీర్ కేసులు అమ్మకాలు సాగుతున్నాయి. పశ్చిమలో దుకాణాలు ఎక్కువగా ఉండటంతో అమ్మకాల జోరు సైతం అదేవిధంగా ఉంది. రాత్రి పది గంటలకు మద్యం దుకాణాలు మూసివేయాలనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. షట్టర్ మూసి వెనుకనుంచి రాత్రంతా అమ్మకాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. మద్యం ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది.

మాట్లాడుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

పామాయిల్ కార్మికుల సంక్షేమం పట్టదా

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు
- పామాయిల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- పామాయిల్ కార్మికుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పామాయిలు గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌తో కార్మికులు చనిపోతే అధికారులు, ప్రభుత్వం స్పందించరా, పామాయిల్ కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోరా అని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. పామాయిల్ కార్మికుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ మంగళవారం స్థానిక యుటిఎఫ్ భవనంలో జరిగింది. మహాసభకు అధ్యక్షవర్గంగా టి.సత్యనారాయణ, జి.సత్యనారాయణ, హరీష్ వ్యవహరించారు. ముఖ్యఅతిథి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ కార్మికుల పరిస్థితి దినదినగండంగా మారిందన్నారు. పామాయిల్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యాన, కార్మిక, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి పామాయిల్ కార్మికులు బలవుతున్నారని మండిపడ్డారు. ప్రమాదాల్లో చనిపోయిన పామాయిల్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ఈ రెండు నెలల కాలంలోనే సుమారు ఐదుగురు పామాయిల్ కార్మికులు విద్యుత్ షాక్‌కు గురై మరణించినా జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరం, సీతానగరం, టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం, జగ్గవరం, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం గ్రామాల్లో పామాయిల్ కార్మికులు విద్యుత్ షాక్ తగిలి చనిపోతే వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, ఎంఎల్‌ఎ, ఎంపీ కనీసం నోరు మెదకపోవడం దారుణమన్నారు. పామాయిల్ కార్మికులను మనుషులుగా చూడకపోవడం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు. పామాయిల్ కార్మికులు ఒకరోజు సమ్మె చేస్తే ఈ జిల్లాలోని పామాయిల్ ఫ్యాక్టరీలు నడుస్తాయా అని ప్రశ్నించారు. పేదల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. ఎంపీకి పామాయిల్ కార్మికుల మరణాలు, వారి ఆందోళనలు కనీసం కనబడట్లేదా అని ప్రశ్నించారు. జిల్లా అధికారుల కనుసన్నల్లోనే పామాయిల్ ధరలు నిర్ణయిస్తుంటే పామాయిల్ తోటల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతన చట్టాలను ఎందుకు అమలు చేయడం లేదని మండిపడ్డారు. జిఒ నెం.73ను అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికుల కనీస వేతన చట్టాన్ని అమలు చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ పేదల బతుకులు సెటిల్‌మెంట్‌తోనే ముగిసిపోవాలా అని ప్రశ్నించారు. పామాయిల్ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, కోరారు. పామాయిల్ కార్మికుల మరణాల నివారణకు విద్యుత్ అధికారులు అవగాహన కల్పించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ మహాసభలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పి.రామ కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, నేతలు తామా ముత్యాలమ్మ, యు.వెంకటేష్, దుర్గ, పామాయిల్ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.సత్యనారాయణ, శ్రీను, హరీష్, రమేష్, రాంబాబు, వెంకటాపురంసర్పంచి పాల్గొన్నారు.

ఏలూరు శనివారపుపేట కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

శాంతించిన తమ్మిలేరు

ఏలూరుకు తప్పిన వరద ముప్పు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగర ప్రజలను వరద భయంతో బెంబేలెత్తించిన తమ్మిలేరు మంగళవారం సాయంత్రానికి శాంతించింది. నాగిరెడ్డిగూడెంలోని తమ్మిలేరు రిజర్వాయర్లో ఇన్‌ఫ్లో పెరగడంతో సోమవారం రాత్రి ఆరు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఏలూరులో తమ్మిలేరు ఉధృతంగా ప్రవహించింది. శనివారపుపేట కాజ్‌వేపై రెండు అడుగుల మేర వరద నీరు ప్రవహించడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేశారు. అధికారుల సూచన మేరకు బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తదితరులు శనివారపుపేట కాజ్‌వేను సందర్శించి పరిస్థితి సమీక్షించారు. నగర ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తంగెళ్లమూడి ప్రాంతంలోని తమ్మిలేరు గట్టుపై ఉన్న కొన్ని నివాసాలు వరదనీటికి ప్రభావితమయ్యే అవకాశం ఉండటంతో జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం 12 గంటల సమయానికే తమ్మిలేరు తగ్గుముఖం పట్టింది. శనివారపుపేట కాజ్‌వేపై అడుగు మేర మీరు తగ్గడంతోపాటు సాయంత్రానికి కాజ్‌వే పైనుంచి పూర్తిగా ప్రవాహం తగ్గింది. అయితే కాజ్‌వేపై బురద పేరుకుపోవంతో రాకపోకలను అనుమతించలేదు. మొత్తం మీద ప్రస్తుతానికి నగర ప్రజలకు వరద భయం తప్పినట్లే అని చెప్పవచ్చు.

తమ్మిలేరు వరదను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్: తమ్మిలేరు వరద దృష్ట్యా ఏలూరు రూరల్, అర్బన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. నగరంలోని తమ్మిలేరు పరీవాహక ప్రాంతమైన శనివారపుపేట కాజ్‌వే, బాలయోగి వంతెన, తంగెళ్లమూడి వంతెన తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తమ్మిలేరు వరద మూలంగా సంబంధిత పరివాహక ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తమ్మిలేరు వెంట ఉన్న గట్ల పటిష్టతను గురించి క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను వారు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు రిజ్వరాయ్ నుంచి నీటిని విడుదల చేయడంతో తమ్మిలేరు పొంగి ప్రవహిస్తుందన్నారు. జిల్లాలో తమ్మిలేరు వరద కారణంగా చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాల్లోని గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎర్రకాల్వ వరద కారణంగా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెంలో వరద పరిస్థితులు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్ కేంద్రాల్లో లైఫ్ జాకెట్లు, రోప్‌లు వంటివి సిద్ధం చేశామన్నారు. కొల్లేరు లంక గ్రామాల్లో బోట్లలో ప్రయాణించొద్దని సూచించారు. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, పాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వరద పరిస్థితులు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గట్ల పటిష్టతను పరిశీలించి బలహీనమైన చోట్ల అవసరమైన ఇసుక బస్తాలు తదితర సామగ్రితో పటిష్టం చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి కెపిఎస్.కిషోర్ మాట్లాడుతూ నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు వరద నీటి విడుదల ఎపటికప్పుడు రెవెన్యూ, పోలీసు అధికారులతోపాటు ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, డిఎస్‌పి శ్రవణకుమార్, ఇరిగేషన్ ఎస్ఇ సి హెచ్.దేవప్రకాష్, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ఏలూరు తహశీల్దార్ గాయత్రి ఉన్నారు

కుక్కునూరు-దాచారం మధ్య తగ్గని వరద

గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం

ముంపులోనే గుండేటి, పాలవాగు కాజ్‌వేలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వారం రోజులుగా పెరుగుతూ వచ్చిన గోదావరి వరద ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో సోమవారం 44.90 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం నాటికి 40.90 అడుగులకు తగ్గింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. భద్రాచలంలో గోదావరి వరద తగ్గుతున్నా మండలంలో మాత్రం వరద నిదానంగా తగ్గుతోంది. శబరి నదికి వరద ఉధృతి ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. గోదావరి తగ్గుముఖం పట్టినా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

ఎర్రకాల్వ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల

పరిశీలించిన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, డిఎస్‌పి, తహశీల్దార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని కొంగువారిగూడెంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయానికి వరద నీరు పోటెత్తింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు. ప్రస్తుతం 82.30 మీటర్లకు చేరుకుంది. దీంతో జలాశయం నుండి 3000 క్యూసెక్కుల నీటిని మూడు గేట్లు ద్వారా విడుదల చేశారు ఇరిగేషన్ అధికారులు. దీంతో లోతట్టు గ్రామాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పంగిడిగూడెం-రాజవరం మధ్యలో ఉన్న కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది. రిజర్వాయర్ వద్ద పరిస్థితిని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ వెంకటరమణ, డిఎస్‌పి రవిచంద్ర, తహశీల్దార్ స్లీవ్‌జోజి పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు.

రెడ్డిగణపవరం గ్రామ సభ వాయిదా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మాట్లాడుతున్న సర్పంచి తెల్లం జయమ్మ

పోలవరం నిర్వాసితుల కోసం భూసేకరణ నిమిత్తం మంగళవారం తలపెట్టిన రెడ్డిగణపవరం గ్రామసభ కోరం లేక వాయిదాపడింది. భూసేకరణ గ్రామసభ సర్పంచి తెల్లం జయమ్మ అధ్యక్షతన ప్రారంభమైంది. అయితే జనం హాజరు తగ్గి కోరం లేకపోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు సర్పంచి ప్రకటించారు. తొలుత సిపిఎం నేతలు కొరసా జలపాలు, పి.మంగరాజు మాట్లాడుతూ టాంటాం వేయకుండా గ్రామసభ తూతూమంత్రంగా నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై గ్రామస్తులు సైతం గొంతు కలపడంతో తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామసభ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సర్పంచి తెల్లం జయమ్మ మినిట్స్ బుక్‌లో రాసి ప్రకటించారు. అలాగే తర్వాత నిర్వహించే గ్రామసభకు ముందుగానే టాంటాం వేయించి గ్రామస్తులందరికీ తెలియజేస్తామని చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల కోసం చేపట్టిన భూసేకరణ గ్రామసభలకు తహశీల్దార్ లేదా పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లేకుండానే స్థానిక విఆర్‌ఒనే భూసేకరణ అధికారిగా పంపడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ అండదండలతో పెద్దఎత్తున ఆర్‌అండ్‌ఆర్‌లో అవినీతి చేయడానికి పూనుకుంటున్నారనేది స్పష్టమవుతుందన్నారు. ఉన్నతాధికారులు ఎవరూ లేకుండా స్థానిక అధికారులతోనే భూసేకరణ చేయడం అనేది విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఏజెన్సీ ప్రాంత చట్టాలకు అనుగుణంగానే గ్రామసభలు నిర్వహించాలని, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా చేపడుతున్న భూసేకరణ నిలుపుదల చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరరావు, వెట్టి వీరయ్య, గొడ్డ పవన్, కట్ట వెంకటేశ్వరరావు, కొమరం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు

సర్వీస్ రోడ్లు, సమస్యలపై రేచర్ల వద్ద నిరసన

సర్వీస్ రోడ్లు ప్రావిజన్ కల్పించాలి.. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేచర్ల వద్ద రైతులు రోడ్డెక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, పంటలు తెచ్చుకునే అవకాశం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకచోట్ల అండర్ పాస్‌లు తగినంత ఎత్తు, వెడల్పుతో నిర్మించకపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకూ ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల ప్రతి గ్రామపరిధిలో సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే అథారిటీ, రెవెన్యూ, భూసేకరణ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలవారీగా రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. పోరాట కమిటీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, ఎపి రైతుసంఘం నాయకులు పి.పాండురంగారావు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్.నారాయణ తదితరులు మాట్లాడుతూ రేచర్ల ఎగ్జిట్ వద్ద రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గం లేదన్నారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. భూసేకరణలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రేచర్ల నుండి లింగగూడెం వరకు ఉన్న అన్ని గ్రామాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు కొనకళ్ల రాఘవరావు, ఉప్పల శ్రీనివాసరావు, ఆది జగన్, ఆది ధర్మారావు, కెక్కిరాల ఉపేంద్ర, బులుసు సతీష్, హరికృష్ణ, చీకటి సర్వేశ్వరరావు, పర్వతనేని మురళీ, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లు కోసం నినదిస్తున్న రైతులు

రైతుల సమస్యలు పరిశీలించిన చింతలపూడి ఎంఎల్‌ఎ, అధికారులు

ఎపి రైతుసంఘం వినతి మేరకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో హైవే అథారిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు, కెఎంవిఎల్ రోడ్డు నిర్మాణ సంస్థ మేనేజర్ తదితరులు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల రైతులకు, ప్రజలకు వస్తున్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. తమ సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని నిలదీశారు. ఈలోపు చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు

జిల్లాకు వెయ్యి టన్నుల యూరియా

జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈనెలలో 7,500 మెట్రిక్ టన్నుల యూరియా అంచనాకుగాను వెయ్యి టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి హబీబ్ భాషా తెలిపారు. ప్రస్తుతం ఇంకా జిల్లాలో 1,298 టన్నుల యూరియా అందబాటులో ఉందని, జిల్లాకు ఇప్పటి వరకు 28,414 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని అన్నారు. ఎరువుల కోసం రైతులు ఆధైరపడొద్దని, అపోహాలు నమ్మొద్దని రైతులను కోరారు. ఈనెలకు సంబంధించి తొలి విడతగా మంగళవారం జిల్లాకు చేరిన వెయ్యి టన్నుల యూరియాను ఆయన తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో అధీనంలోకి తీసుకుని లారీలతో సరఫరాకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ జెడి మాట్లాడుతూ జిల్లాకు చేరిన ఎరువులలో 70 శాతం 96 సొసైటీలు, 11 డిసిఎంఎస్ కౌంటర్లు ద్వారా మిగిలిన 30 శాతం ప్రయివేటు డీలర్ల ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే జిల్లాలో ఎరువుల విక్రయదారులతో సమావేశం నిర్వహించి ఎరువుల అమ్మకాలపై తగు సూచనలు చేశారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మొత్తంగా ఎరువులు 1,18,402 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా అందులో 33,776 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమన్నారు. జిల్లాలో డీలర్లు ఎవరూ బ్లాక్ మార్కెటింగ్ చేసినా, అధిక ధరలకు అమ్మినా, అక్రమంగా తరలించినా లైసెన్సును రద్దుచేసి వారిపై ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు జరిపి మొత్తం పదికేసులు నమోదుచేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన ఎరువుల నిల్వలను అమ్మకం నుండి నిలుపుదల చేసి జాయింట్ కలెక్టర్ కోర్టులో దాఖలు చేసినట్లు తెలిపారు. లింగపాలెం, పెదపాడు మండలాల్లో ఎరువుల అక్రమ రవాణాను గుర్తించి పోలీసు కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎరువుల అక్రమ రవాణాను నియంత్రణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జమాయిల్, ఆయిల్‌పామ్ పంటలకు కాకుండా, వరి సాగు రైతులు మాత్రమే యూరియా వినియోగించుకోవాలన్నారు. అనధికారికంగా విక్రయించే ఎరువులు కొనుగోలు చేయవద్దన్నారు. గుర్తింపు పొందిన దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేసి బిల్లులను తప్పనిసరిగా అడిగి తీసుకోవాలన్నారు.

పాఠశాల బస్‌ను వెనుక నుంచి ఢీకొన్న లారీ

విద్యార్థులు సురక్షితం

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థులను ఎక్కించుకోవడానికి ఆపిన పాఠశాల బస్‌ను వెనక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టడంతో బస్‌లో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన ఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం ప్రతిభ పాఠశాలకు చెందిన బస్ లక్ష్మీపురం సెంటర్‌లో విద్యార్థులను ఎక్కించుకోవడానికి ఆగింది. అయితే ఎదురుగా లారీ వస్తుండటంతో వెనక నుంచి వచ్చే లారీ బస్‌ను చివర ఢీ కొట్టి ఆగింది. దీంతో బస్‌లో కూర్చున్న విద్యార్థులు భయ భ్రాంతులకు గురయ్యారు. వెంటనే లారీ డ్రైవర్ లారీని నిలిపివేయడం తో పెను ప్రమాదం తప్పిందని అంత ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో బస్‌లో ఉన్న పిల్లలెవ్వరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

డిఎస్‌సి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండవ విడతలో సెలెక్ట్ అయిన 33 మంది డిఎస్‌సి అభ్యర్థులకు మంగళవారం వట్లూరులోని సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. మొదటి విడత అనంతరం వికలాంగులు, ఇతర అభ్యర్థులకు సోమవారం 33 మందికి విద్యాశాఖ కమిషనరేట్ నుంచి కాల్ లెటర్స్ పంపించడం జరిగిందని, వారందరికీ మంగళవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఆటో కార్మికుల ర్యాలీ

జంగారెడ్డిగూడెం : పట్టణంలో మంగళవారం ఆటో యూనియన్ ఆధ్వర్యాన ఆటో కార్మికులందరూ భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకం పెట్టిన తర్వాత ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడేటట్టు ఉన్నాయని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి తమ ఆటో కార్మికులకు ఏదో మార్గం చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో అన్ని ఖర్చులు పోను రూ.400 వరకు వచ్చేవని, ఇప్పుడు పరిస్థితి అలా లేదు. కనీసం ఆటోలో డీజిల్ కొట్టించడానికి కూడా డబ్బులు లేని పరిస్థితిలో ఆటో డ్రైవర్లు ఉన్నారని, ఆటో యూనియన్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గోడు పట్టించుకోని తగిన పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని ఆటో యూనియన్ వారు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్ పున: ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని లోపూడి గ్రామంలో ఎన్‌టిఆర్ సుజల ప్రవంతి పథకం ద్వారా నిర్మించిన వాటర్ ప్లాంట్ మంగళవారం తిరిగి పునరుద్ధరించారు. వాటర్ ప్లాంట్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో లోపూడి గ్రామ నాయకులు మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి వాటర్ ప్లాంట్ కోసం ప్రజలు ఇబ్బంది పడకూడదని నిధులు మంజూరు చేయించి, వాటర్ ప్లాంట్ మరలా పునరుద్ధరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, చలమాల వెంకటేశ్వరరావు, లక్ష్మాపాము కాంతారావు, వంజుగల వెంకయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని పదో వార్డులో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ నాయకులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెస్, షార్ట్ పుట్, చైనీస్ చెక్కర్ పోటీలు, ఉపాధ్యాయినులకు షార్ట్ పుట్, చెస్, చైనీస్ చెక్కర్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ఉపాధ్యాయ దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, మల్లేశ్వరరావు, ఫిలోమినా, మంగాలక్ష్మి, ఉమాదేవి, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో ఎంపిటిసి సభ్యులు పి.కాళవతి నోటు పుస్తకాలు అందజేశారు. మంగళవారం మెడల్ ప్రైమ్ స్కూల్ హెచ్ఎం తొమ్మండ్రు యువరాజు ఆధ్వర్యాన తమ వంతు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు 300 నోట్స్, 100 పెన్నులు, 20 పలకలు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం తొమ్మండ్రు యువరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యక్రమం పి-4లో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తొమ్మండ్రు యువరాజు, హై స్కూల్ హెచ్ఎం డి.భాస్కరరావు, పాఠశాల గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు అవిర్నేని పద్మాకర్ రావు, పాఠశాల అభివృద్ధి నాయకులు పోషడప్ప శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు దుర్మార్గం

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సిహెచ్.దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విజనరీ లీడర్, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీని తొలగించడం దుర్మార్గమని పట్టణ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మంత్రి కార్యాలయంలో టిడిపి పట్టణ నాయకులు మంగళవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూజివీడు పట్టణ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మొదటిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా టిడిపి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ సంబరాలు చేసుకొన్న విషయం తెలిసిందేనన్నారు. దాన్ని చూసి ఓర్వలేక వైసిపి వారు మా నాయకుడి ఫ్లెక్సీని తొలగించడం దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు. మొదటి తప్పుగా క్షమిస్తున్నామని, మరలా పునరావృతం అయితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పి.నాగరాజు, ఇళయరాజా, నాగమణి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక వైఎస్ఆర్ నగర్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివే 103 మంది విద్యార్థులకు సంబంధించి 75 కుటుంబాలకు రూ.లక్ష 35 వేలు విలువైన నిత్యావసర సరుకులను సోమవారం సాయంత్రం ట్రేస్ ఇండియా, టుగెదర్ ఇండియా, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం బస్తా, ఒక కేజీ కందిపప్పు, ఒక కేజీ వేరుశనగ గుళ్ళు, ఒక కేజీ బెల్లం అందజేశారు. ఈ సందర్భంగా ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ దిడ్ల ఆంజిలో, స్వర్ణ కుమారి దంపతులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద కుటుంబాలకు వర్షాకాలం సందర్భంగా పనులు లేక ఇబ్బందికర పరిస్థితులు ఉన్న నేపథ్యంలో వారికి చేయూతనందించామని తెలిపారు. ఎపిఎస్‌టిఎ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జిజెఎ.స్టీవెన్, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా అలీ పాల్గొన్నారు.

గోపాలకృష్ణకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - కుక్కునూరు

ఇటీవల పాము కాటుకు గురై చికిత్స పొంది ఇంటికి చేరిన జనసేన మండల ఉపాధ్యక్షులు గోపాలకృష్ణని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పరామర్శించారు. ఆయన మంగళవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కుక్కునూరు ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల వసతి సమస్యలపై అధికారులతో ఫోన్‌లో చర్చించి, వాటిని తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా గుండేటి వాగులో గోదావరి వరద నీటి ప్రభావంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయిన పరిస్థితిని కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ములిసెట్టి యుగంధర్, టిడిపి మండల అధ్యక్షులు ములిసెట్టి నాగు పాల్గొన్నారు.

వైద్యం వికటించి యువతి మృతి

నేరాలు - ఘోరాలు

ఏలూరు స్పోర్ట్స్ : ఆర్‌ఎంపి వైద్యుడు చేసిన వైద్యం వికటించి యువతి మృతి చెందిందని ఆమె బంధువులు ఆర్‌ఎంపి వైద్యుడి క్లినిక్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. సంబంధిత వివరాల ప్రకారం ఏలూరు ఒకటో పట్టణ పరిధిలోని తూర్పు వీధి మేకల కబేలా ప్రాంతానికి చెందిన కటారి భారతి(20) భర్తతో కలిసి జీవిస్తుంది. ఆమె గత మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతుంది. ఆమెను మంగళవారం వంగాయిగూడెం సెంటర్లో ఆర్‌ఎంపి వైద్యునిగా పనిచేస్తున్న నాని వద్దకు చికిత్స నిమిత్తం భర్త బంధువులు కలిసి తీసుకువెళ్లారు. అతని క్లినిక్ పక్కనే ఉన్న వాసవి మెడికల్స్‌లో రెండు ఇంజక్షన్లు తీసుకుని అతను ఆమెకు చేశాడు. కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని బంధువులకు సూచించాడు. ఇంజక్షన్ చేసిన 15 నిమిషాల వ్యవధిలో ఆమె స్పృహ కోల్పోయింది. కంగారుపడ్డ బంధువులకు ఆర్‌ఎంపి ఏమీ కాదని చెప్పాడు. మరి కొంతసేపటికి మెరుగైన వైద్యం కోసం వేరొక ఆసుపత్రికి తరలించాలని సూచించాడు. అయితే బంధువులు ఆమెను వేరొక ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తూ ఉండగా ఆమె మృతి చెందింది. దీంతో క్లినిక్ వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చ చెప్పారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త, కుటుంబ సభ్యులపై కేసు

జీలుగుమిల్లి : అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. వివరాల ప్రకారం స్వర్ణ వారిగూడెం గ్రామానికి చెందిన దాసరి రత్నకుమార్‌కు రాచన్న గూడెం గ్రామానికి చెందిన మహిళకు గత కొంతకాలం క్రితం వివాహమైనట్లు, వివాహ సమయంలో రూ.3 లక్షల కట్నం, సారె సామాన్లు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం భర్త ప్రతి రోజు విపరీతంగా తాగి అధిక కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడని, అతనితో పాటు కుటుంబ సభ్యులు కూడా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడికి గాయాలు

జీలుగుమిల్లి : వాహనాలు మితిమీరిన వేగంతో కాకుండా నెమ్మదిగా వెళ్లాలని రహదారిపై ఏర్పాటు చేసిన డ్రమ్ముని ద్వి చక్ర వాహనంపై వస్తున్న యువకుడు ఢీ కొట్టి బోల్తా పడ్డాడు. ఈ ఘటన మండలం లోని లక్ష్మీపురం గ్రామంలో చోటు చేసుకుంది. గాయపడిన యువకుడు స్పృహ తప్పడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా యువకుడు కామయ్యపాలెం గ్రామానికి చెందిన పి.మహేష్‌గా గుర్తించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



చింతలపూడిలో కేక్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ రోషన్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, విజయవాడ జోనల్ ఆర్‌టిసి ఛైర్మన్ శ్రీరెడ్డి అప్పలనాయుడు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్వీట్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా ఆయన స్వగ్రామం మొగల్తూరుకు చెందిన ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాన్ని కల్పిస్తూ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీహరి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.భీమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఏలూరు 17వ డివిజన్ పడమర వీధిలోని గాంధీ మైదానం వద్ద 17వ డివిజన్ ఇన్‌ఛార్జి లక్కింశెట్టి కిరణ్ కుమార్ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, జనసేన నాయకులు నారా శేషు నగర ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చింతలపూడి : పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు ఆధ్వర్యాన డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రగడవరం గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు చంద్రబాబు ఆధ్వర్యాన యర్రంపల్లి సొసైటీ ఛైర్‌పర్సన్ తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో మంగళవారం పట్టణ ఉపాధ్యక్షులు నరేష్ నాయుడు ఆధ్వర్యాన మమత హాస్పిటల్ వారిచే ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మెడికల్ క్యాంపు ప్రారంభించి, పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పేద విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జి, జనసేన పట్టణ అధ్యక్షులు పీరు, టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, జనసేన నాయకులు కరాటం సాయి, జనసేన మండల అధ్యక్షులు ఆకుల రాకేష్ పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే చెక్కపల్లి గ్రామంలో(కమ్యూనిటీ హాల్లో) ఇండియన్ రెడ్ క్రాస్ వారిచే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల కో ఆర్డినేటర్ తోట ప్రభాకర్ ఆధ్వర్యాన చెక్కపల్లి గ్రామస్తుల సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తోట ప్రభాకర్, సూరేపల్లి మల్లిబాబు, మామిడిశెట్టి సత్యబాబు, చిలుకూరి వెంకటేశ్వరరావు, చిలుకూరి దేవేంద్ర, పల్లి రాజు, పల్లి దిలీప్, పాశం నాగబాబు పాల్గొన్నారు.

టి.నరసాపురం : జనసేన ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ సెంటర్లోని జనసేన కార్యాలయం వద్ద జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, చింతలపూడి నవీన్ పుట్టినరోజు కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

దెందులూరు: జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పెదవేగి మండలం, విజయరాయి గ్రామ జనసేన నాయకుల ఆధ్వర్యంలో విజయరాయి గ్రామంలో రక్తదాన శిబిరాన్ని దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎపి వడ్డీ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఘంటసాల వెంకట లక్ష్మి ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకి సన్మానం చేసి, విద్యార్థులకు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో దెందులూరు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ బర్మా ఫణిబాబు క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అనాధ శరణాలయంలో చిన్నారులకు అల్పాహారం అందజేసిన ఫణిబాబు అనంతరం భారీ ర్యాలీగా బయలుదేరి పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో కేక్ కోసి ప్రజలకు పంచారు.

కలిదిండి : మండలంలోని తాడినాడలో జనసేన సెంట్రల్ ఆంధ్రజోన్ కో కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు సహకారంతో హెవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించి, పవన్ కళ్యాణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్ఎకె.శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భీమడోలు : ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెల అక్కడ నమోదైన సుమారు 70 మందికి నిత్యావసర, పౌష్టికాహారం పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఆసుపత్రిలో రోగులను పరామర్శించి పళ్ళు, రొట్టెలు పంచి పెట్టారు. అనంతరం స్థానిక సిటిఆర్ఐ ముందు ఉన్న ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేశారు. సర్పంచి చిర్రి జగదాంబ, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు ఎస్.సాయి, పి.రాము పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, రిటైనింగ్ వాల్ నిర్మించాలని వినతి

బుట్టాయగూడెం : కొరసవారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోగల గ్రామాలకు సీసీ రోడ్లు, వర్షపు నీళ్ల మళ్లించడానికి రిటైనింగ్ వాల్ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్‌ని పంచాయతీ సర్పంచి కొర్స గంగరాజు, గ్రామస్తులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కొర్సవారిగూడెం పంచాయతీ పరిధిలో గల గ్రామాలకు సీసీ రోడ్లు లేకపోవడం వల్ల నడవడానికి ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీసీ రోడ్లు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కురసం ఏసు, గుజ్జు రామారావు, తెల్లం రమేష్, కూరం వెంకటేశ్వరరావు, కూరం గాంధీ, గుండి రాముడు, పూసం గంగాధరరావు పాల్గొన్నారు.

అర్హులకు పింఛను నమోదు చేయాలి

సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్

బుట్టాయగూడెం : 50 సంవత్సరాలు పైబడిన ఎస్‌సి, బిసిలకు పింఛన్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు నోరు మెదపడం లేదని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డి గణపవరం సచివాలయం వద్ద కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలియజేశారు. రెడ్డి గణపవరం సచివాలయం పరిధిలో వితంతువులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద మహిళలు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పెన్షన్ నమోదు చేయట్లేదని, గ్రామ సచివాలయం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అర్హులైన వితంతువులకు, పేదలకు పెన్షన్ నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఒక్కొక్క వితంతు మహిళ రెండు లక్షలు, మూడు లక్షలు నష్టపోయారని, నష్టానికి కారకులైన వారిపై కూటమి ప్రభుత్వం దర్యాప్తు జరపాలన్నారు. పేదల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న సచివాలయం అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫ్రాన్సిస్ కోరారు. కార్యక్రమంలో కొమరం శ్రీరాములు, చెన్ను దుర్గారావు, కె.గంగరాజు, ఎన్.నాగేశ్వరావు, వి.విజయ, పి.వెంకటేష్, కె.లక్ష్మి, ఎన్.రమణయ్య, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎఎల్ఎస్ అంబులెన్స్ ప్రారంభం

ఏలూరు సిటీ : జిల్లాలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా కీలకమైన చర్యలో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో కూడిన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఎఎల్ఎస్) అంబులెన్స్‌ను జిల్లాకు కేటాయించారు. ఈ అంబులెన్స్‌లో అత్యవసర వైద్య సేవలకు అవసరమైన అన్ని ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఎఎల్ఎస్ అంబులెన్స్‌ను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్వయంగా పరిశీలించి, దానిలోని వైద్య పరికరాలు, సాంకేతిక సౌకర్యాల గురించి వివరంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన జెండా ఊపి ఈ అంబులెన్స్‌ను జిల్లా ప్రజల సేవ కోసం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ఈ కొత్త ఎఎల్ఎస్ అంబులెన్స్ జిల్లా ప్రజలకు అత్యవసర వైద్య సేవలను సకాలంలో, సమర్థవంతంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్(పబ్లిక్-ప్రయివేట్ పార్టనర్‌షిప్ - పిపిపి) ఆధ్వర్యంలో జిల్లాలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉందన్నారు. ఈ అంబులెన్స్‌లో అత్యవసర సమయంలో రోగుల జీవన రక్షణకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు, డిఫ్రిజిలేటర్లు, ఇంజక్షన్లు, మందులు, ఇతర అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జికి శాశ్వత పరిష్కారం చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్

ఏలూరు అర్బన్ : అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నప్పటికీ పవర్ పేట రాజీవ్ స్నేహ వారధి(అండర్ గ్రౌండ్ బ్రిడ్జి)కి శాశ్వత పరిష్కారం చూపించటంలో కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ విమర్శించారు. మంగళవారం సిపిఎం నగర కమిటీ సమావేశం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో వైఎస్.కనకారావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన రవి, ప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాలుగా రాజీవ్ స్నేహవారధి పేరుతో రూ.కోట్ల ప్రజా సొమ్ము ఖర్చు పెడుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపించలేకపోయారని అన్నారు. నిరంతరం నీళ్ల ప్రవాహం కారణంగా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో ప్రయాణం చేసే ద్విచక్ర వాహనాలు, కార్లు రిపేర్లు వచ్చి ప్రజలు నష్టపోతున్నారని వాపోయారు. ప్రతిరోజు భూమి నుండి వస్తున్న జలాలు తోడటానికి రూ.లక్ష విద్యుత్ బిల్లులకు, సిబ్బంది జీతాలకు ఖర్చు పెట్టడానికి సిద్ధపడుతున్న పాలకులు శాశ్వత పరిష్కార మార్గాలు చూడలేకపోయారని విమర్శించారు. నిత్యం నీళ్ల ప్రవహించటం వల్ల నాచు పట్టి వాహనదారులు జారిపడి గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ప్రమాదాలు జరగకముందే కార్పొరేషన్ అధికారులు, పాలకులు మొద్దు నిద్ర విడనడాలని హితవు పలికారు. ఈ సమస్య పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో సిపిఎం ఆధ్వర్యాన రాజీవ్ స్నేహ వారధి సమస్య పరిష్కారానికే ఆందోళనకి దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి పంపన రవికుమార్, వివివిఎన్.ప్రసాద్, అరుణ కుమారి, జి.రవికిశోర్, ఎస్ఎన్.రమేష్, జె.గోపి పాల్గొన్నారు.

కళ్ల వ్యాధుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

వైద్య నిపుణురాలు డాక్టర్ హేమలత



పరీక్షిస్తున్న వైద్యురాలు

ప్రజాశక్తి - దెందులూరు

సీజనల్‌గా వచ్చే కళ్ల వ్యాధులు, కళ్ల కలకల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రవికిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ హేమలత అన్నారు. పాలగూడెం గ్రామంలో కళ్యాణ మండపం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి నేతల రవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ కళ్లు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉంచుకోవాలని, కంటి సంబంధిత వ్యాధుల పట్ల సంబంధిత డాక్టర్లకు చూపించుకుని తగిన చర్యలు చేసుకోవాలని అన్నారు. కంట్లో ఉండే శుక్లాలు, రెటీనా సంబంధిత వ్యాధులు, నల్ల గుడ్డు సంబంధించినటువంటి ఇబ్బందులు తదితర అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి నేతల రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి కంటి పరీక్షలు చేయడం పలువురికి ఆదర్శనీయమని అన్నారు. రవికిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఉచితంగా సేవలు అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మల్కాపురం, చింతమనేని కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, కోమడవోలు ప్రాంతాల నుంచి ప్రజలు పాల్గొన్నారు. అనేకమంది వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకుని సలహాలు, సూచనలు పాటించారు. 152 మంది పైబడి ప్రజలు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు పొందారు. అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి నేతల రవి, గ్రామ ప్రముఖులు పరదేశి, పంచాయతీ కార్యదర్శి జగదీష్, తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీకి పూర్వ వైభవం రావాలి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు



బాధ్యతలు చేపట్టిన సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు

టి.నరసాపురం : టి.నరసాపురం సొసైటీని పూర్వ వైభవంలోకి తీసుకురావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. టి.నరసాపురం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా జోనుబోయిన సోంబాబు, సభ్యులుగా మోదుగు రామారావు, వుయ్యూరి నాగమణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శీలం వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నేతలు నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్ర స్థాయిగా అభివృద్ధి చెందిన సొసైటీ నేడు తీవ్ర నష్టాల్లో నిలిచిందని, ఆ నష్టాలను అధిగమించి మునుపటి వైభవంలోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్ సోంబాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన పంట రుణాలు ఇచ్చే విధంగా, గడువు ముగిసిన డిపాజిట్లు డిపాజిట్ దారులకు అందించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. ఉద్యోగ సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. సంఘం సభ్యులు, రైతులు అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎంపీ పుట్టా మహేష్, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, శీలం వెంకటేశ్వరరావులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సొసైటీ సిబ్బంది, పలువురు రైతులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.ఫాణి, కొల్లి మురళీ, అద్దంకి జగ్గారావు, నీటి సంఘం అధ్యక్షులు మోహన్, వేములయ్య పాల్గొన్నారు.

పలుచోట్ల వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

ఏలూరు సిటీలో..

ఏలూరు సిటీ : కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలో వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏలూరు నగర నాయకులు ప్రతాప్ సుబ్రహ్మణ్యం శర్మ, బ్లాక్‌వన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కగుప్త, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర అధ్యక్షతన కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు. గ్రామంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయ రాజు, పట్టణ అధ్యక్షులు కర్పూరం గుప్తా, రాష్ట్ర అధికార ప్రతినిధి జట్టి గురునాధరావు, పట్టణ, మండల వైసిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు ఆధ్వర్యాన చింతలపూడి పాత బస్టాండ్, నగర పంచాయతీ వద్ద, మారుతీ నగర్‌లోని వైఎస్ విగ్రహానికి, మార్కెట్ యార్డ్‌లో గల వైఎస్ విగ్రహానికి, చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్‌లో, సుప్రియన్ పేట, మల్లయగూడెం వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో రోగులకు పళ్ళు, రసుకులు, రొట్టె పంపిణీ చేశారు.

ముసునూరు : రాష్ట్రం గర్వించేలా పరిపాలన అందించిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలోని 16 గ్రామాల్లో 16వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మండల నాయకులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, కోటగిరి రాజా నాయన, బి.నరసింహారావు, కాటేపల్లి రమేష్, జలగం శేషగిరిరావు, వరికూటి ప్రతాప్, రేగుల లోకేశ్వరరావు, పల్లిపాము సూర్య, జి.రంగారావు, కంచర్ల వాణి పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలో మాజీ ఎంఎల్ఎ వాసుబాబు నివాళులర్పించారు. నారాయణపురంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ మరడ రమావతి, మండల కన్వీనర్ మరడ మంగారావు, ఎంపిటిసి సభ్యులు అరవెల్లి మహాలక్ష్మి, బండారు నాగరాజు, చేబ్రోలులో సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పాపారావు బాబ్జి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వైఎస్ఆర్ 16వ వర్ధంతి వేడుకలను మంగళవారం ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్లో మండల వైసిపి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసిపి మండల అధ్యక్షులు బి.రాంబాబు, టౌన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : వైఎస్ఆర్ 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ముదినేపల్లి బస్టాండ్ దగ్గర రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ బిక్షాలు, బేతపూడి వెంకటరమణ సోమలప్రసాద్, పల్లెం పుణేశ్వరరావు, పుట్టి నరసింహారావు పాల్గొన్నారు. చిగురుకోటలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గ్రామ నాయకులు నివాళులర్పించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో వైఎస్ఆర్ చిత్రపటానికి మాజీ ఎంఎల్ఎ ప్రతాప్ అప్పారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన కోడిగుడ్లు అందించాలి: జెసి

భీమడోలు : అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, సంయుక్త కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని సూరప్పగూడెం గ్రామంలో గల కోడిగుడ్ల స్టాక్ పాయింట్ సంయుక్త కలెక్టర్ తనిఖీ చేశారు. పలు సూచనలు జారీ చేశారు.

CHANGE OF NAME

I, **PEMMADI LAVANYA** W/o. Pemmadi Krishna Raghavendra Rao, D.No. 7-14-21, Ward -9, Indira Nagar, Narasapuram-534275, W.G.Dt. A.P.- 534275. I have changed my name from **PEMMADI MANGA** (Old name) to **PEMMADI LAVANYA** (New name) hence forth I am being called **PEMMADI LAVANYA** W/o. Pemmadi Krishna Raghavendra Rao for all purposes.

పాస్‌పోర్టు పోయినది

కొండేటి లలిత కుమారి, భర్త - నాగరాజు, డోర్ నెంబర్ 6-174, కొంతేరు, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా,ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి M5297011 నెంబర్ పాస్‌పోర్ట్ ది 5-01-2015న పొంది యున్నాను. నేను ది 20-7-2025న మా ఇంటి నుంచి మేడపాడు సెంటర్‌లో నా ఒరిజినల్ పాస్ పోర్ట్‌తో జెరాక్స్ కాపీలు తీయించుటకు బైక్‌పై వెళుతుండగా దారిలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ కాపీలు పడి పోయినవి. దారిలో ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 79954 58466

మహారాజశ్రీ II Addl సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తాడేపల్లిగూడెం వారి కోర్టులో

O.S.No.357/2024

Between:

సత్తి రామకృష్ణారెడ్డి వగైరా ...వాదులు

And

గొలుగూరి శ్రీనివాస త్రిమూర్తిరెడ్డి వగైరా ...ప్రతివాదులు

పై నెంబరు దావా గ్రంథములో 1వ ప్రతివాది అయిన గొలుగూరి శ్రీనివాసత్రిమూర్తి రెడ్డి, S/o.సుబ్బిరెడ్డి, Male, Age 55 Yrs, ముదునూరు (V), పెంటపాడు (M), ప.గో.జిల్లా. అను మీకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు సమన్లు పంపిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతున్నారు. కావున శ్రీకోర్టు వారు Substitute Service ద్వారా సమన్లు జారీ చేయమని ఆర్డరు యిచ్చియున్నారు. సదరు దావా ది.25-9-2025 తేదీన వాయిదా అయి ఉన్నది. కావున ఆ తేదీన మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ కోర్టుకు హాజరయి, తమ ఆక్షేపణలను తెలుపగలరని, లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానము జరుగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

టి.లీలామాధవ్
తాడేపల్లిగూడెం అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తేది.1-9-2025 సెల్: 9346409563.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

Creditor I.P.No.18/2021

Between:

మేడపాటి రామచంద్రారెడ్డి ...పిటీషనరు

And

ఆసూరి శైలజ వగైరా ...రెస్పాండెంట్లు

3వ రెస్పాండెంట్ :

గంధం హరిణి పుష్పవాణి, భర్త వెంకటేశ్వరరావు, డోర్‌నెంబర్.2-195, మేడపాడు, యలమంచిలి మండలం.

పై నెంబరు పిటిషన్‌లో 3వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం ది.18-09-2025 సం. తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు పిటీషను ముందు గ్రంథము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది, పాలకొల్లు,
తేది.06-09-2025 పశ్చిమ గోదావరి జిల్లా.

ప్రకటన

నా క్లయింటు యాకాల అశోక్‌కుమార్, తండ్రి : సత్యనారాయణ వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి యాజమాన్య బదిలీలు ద.నెం.లు 2694/2017, 3118/2011, 651/1990, 364/1983, 1130/1980ల ద్వారా జరగగా, సదరు దస్తావేజులలో 1130//1980, 651/1990 దస్తావేజులు పోయినవి. ఇంటిపన్ను కూడా అమ్మకపుదారు కాసగాని చంద్రావతి భర్త : చంద్రబోస్‌ల పేర్లుపై ఉన్నది. పై దస్తావేజుల ద్వారా నా క్లయింట్ అశోక్‌కుమార్ గారు కాసగాని చంద్రావతి గారి వద్ద నుండి కొనుగోలు చేయు చున్నారు. పోయిన దస్తావేజుల కొరకు పోలీస్ ఫిర్యాదు, దొరకబడని ధృవీకరణ సర్టిఫికెట్ నెం. 1520137161018 గా నమోదు జరిగింది.

షెడ్యూల్ ఆస్తి వివరాలు : ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, జంగారెడ్డిగూడెం పట్టణం, రి.స. నెం.133, చ॥గ॥ 97 1/2, కొత్త డోర్ నెం. 2-13-655, గ్రౌండ్ మరియు ఫస్ట్‌ఫ్లోర్ గల బిల్డింగ్ హద్దులు : తూర్పు: రోడ్డు, దక్షిణం : బంటు అప్పన్న, పడమర : దార్ల సత్యనారాయణ, ఉత్తరం : టీచర్ సత్యనారాయణ

ఏ.యు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో గృహరుణం పొందుచున్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరాలు వున్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన తేదీ మొదలు (7) ఏడు దినములలోగా ఈ దిగువ తెలిపిన మా అడ్రస్‌కి తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా తెలియజేయ గలరు. లేనియెడల ఎవరికి ఏ విధమైన అభ్యంతరాలు లేవని భావించి లోను పొందుట జరుగును. గడువు తర్వాత వచ్చు ఏ విధమైన క్లయిమ్‌లు, అభ్యంతరాలు మా క్లయింట్ లేదా రుణదాతను గానీ ఏ విధమైన స్థిరపరచ జాలవని యావన్మందికి తెలియజేయు చున్నాను.

ఇట్లు
కె.సర్వేశ్వరరావు,
కె.అలేఖ్య,
న్యాయవాదులు,
డోర్‌నెం. 14-482, భగత్‌సింగ్ నగర్, యన్‌టిఆర్ బస్టాప్ ప్రక్కన, యనమలకుదురు. విజయవాడ. ఫోన్ : 95818 73334.